సంపుటి : 9
సంచిక : 322
శుక్రవారం
14 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER


# విశ్వం వాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.
10 YEARS CELEBRATING
SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT
CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

# ఉచితాలకు హద్దు.. సంక్షేమానికి కొత్త బాట!




**హైదరాబాద్/అమరావతి, ఆగస్టు 13, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి:**

ప్రజల కష్టకాలంలో చేయూత ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. ఆకలితో ఉన్న కుటుంబానికి ఆహారం, వృద్ధుడికి పింఛను, పేద విద్యార్థికి చదువు, అనారోగ్యంతో ఉన్నవారికి వైద్యం అందించడం సంక్షేమ రాజ్యానికి అవసరమైన బాధ్యతే. కానీ అదే సమయంలో ప్రతి పథకం నిజమైన అర్హుడికే చేరుతోందా?.. ప్రజల నుంచి పన్నుల రూపంలో సమకూరిన ప్రతి రూపాయి సమర్థవంతంగా ఖర్చవుతోందా?.. తాత్కాలిక నగదు సహాయాల కంటే ప్రజలను స్వయం సమృద్ధి వైపు తీసుకెళ్లే విధానాలకు ప్రాధాన్యం పెరుగుతోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. తెలంగాణ హైకోర్టులో ఇటీవల జరిగిన ఒక కేసు విచారణ సందర్భంగా సంక్షేమ పథకాల అర్హతలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, ప్రజాధన వినియోగంపై న్యాయమూర్తి వ్యక్తం చేసిన ఆందోళనతో 'ఉచితాల రాజకీయాలు' మరోసారి చర్చకు వచ్చాయి. అయితే అవి విచారణ సందర్భంగా వ్యక్తమైన వ్యాఖ్యలేనని, సంక్షేమ పథకాలను రద్దు చేయాలంటూ ఇచ్చిన తీర్పుగా భావించరాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

అసలు ప్రశ్న సంక్షేమం ఉండాలా?.. వద్దా?.. అన్నది కాదు. సంక్షేమం ఎవరికి?.. ఎంతవరకు?.. ఏ లక్ష్యంతో? అన్నదే ఇప్పుడు సమాజం ముందు ఉన్న కీలక ప్రశ్న.

**పేదవాడి వాటా అనర్హుడికి ఎందుకు?**

ప్రభుత్వ సహాయం నిజమైన నిరుపేదకు చేరితే అది జీవన భరోసా. కానీ ఆర్థికంగా స్థిరంగా ఉన్నవారు కూడా అర్హతల లోపాలు, పాత రికార్డులు లేదా సరైన తనిఖీలు లేకపోవడం వల్ల అదే ప్రయోజనాలు పొందితే అసలైన పేదవాడి వాటా తగ్గే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రతి సంక్షేమ పథకంలో లబ్ధిదారుల అర్హతలను కాలానుగుణంగా పునఃపరిశీలించాలన్న అభిప్రాయం బలపడుతోంది.

**ఉచితం కాదు.. ఉపాధి కావాలి!**

నెలకు కొంత నగదు సహాయం ఒక కుటుంబానికి తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చు.

కానీ.. నాణ్యమైన విద్య జీవితాన్ని మార్చగలదు.

ఉచిత నాణ్యమైన వైద్యం కుటుంబాన్ని అప్పుల నుంచి కాపాడగలదు.

సొంత ఇల్లు కుటుంబానికి మిగతా .. 2లో..

# రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

- అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు
- ఐదు కాన్సెప్టులతో దేశం మెచ్చిన రాజధానిగా అమరావతి
- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన



**అమరావతి, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ – మంగళగిరి – గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ–3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ. 1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ "రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా మిగతా .. 2లో..

# ఏపీ ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తుంది

**రాష్ట్రంలోనూ ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు**

**అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**



**పార్వతీపురం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సృష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల మిగతా .. 2లో..

**పోలీసులతో కూడా చంద్రబాబు భజన**

# చేయించుకుంటున్నారు

**మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని**

**తాడేపల్లి, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** సొంత పార్టీ నేతల భజనతో వచ్చే కిక్ సరిపోక, ఇప్పుడు సీఎం చంద్రబాబు ఏకంగా ఖాకీ దుస్తుల్లో ఉన్న పోలీసులతోనూ తనను తాను పొగిడించుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయి మిగతా .. 2లో..

**ఇవాళ జైలులో**

# నన్ను కూడా అవమానించారు

**కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్**



**కర్నూలు, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో మిగతా .. 2లో..




# ఖర్గేకు అవమానం..

**రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు**



**ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అవమానం జరిగిందంటూ, బీజేపీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బీజేపీ, హిందుత్వ సంస్థలు గంగా జలంతో శుద్ధి చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపిస్తూ రేపు (ఆగస్టు 14) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. "బీజేపీ చేసిన హవనం.. దళితుల వ్యక్తిత్వానికి జరిగిన హననం" అని ఆమె మిగతా .. 2లో..

**'లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు**

# నేను దాసుడిని'

**పాక్ మాజీ మంత్రి**

**ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్‌లోని రాజకీయ నేతలు, ఉగ్రవాదుల మధ్య సంబంధాలు మరోసారి బహిర్గతమయ్యాయి. లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు తాను దాసుడిని అంటూ బహిరంగ వేదికపై మాజీ మంత్రి షేక్ రషీద్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ఆయన మాట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అప్పుడు ఆ వేదికపై లష్కరే కమాండర్, ఇతర ఉగ్రసంస్థల సభ్యులు కూడా ఉన్నారు. "నేను హఫీజ్ సయీద్ దాసుడను. నా ఫోన్‌లో హఫీజ్ ఫోన్ నంబర్ దొరకడం వల్లే అమెరికా మిగతా .. 2లో..

**ఆ స్థలాలు ఎక్కడికీ పోవు..**

# నేను హామీ ఇస్తున్నా

**తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నిషేధిత జాబితాలో (22ఏ) చేర్చిన భూముల విషయంలో హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చిన సందర్భాల్లో, వివాదంలో లేని భూములకు బై-నంబర్లు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉచితాలకు హద్దు.. సంక్షేమానికి కొత్త బాట!

శాశ్వత భద్రతనిస్తుంది.

నైపుణ్యం, ఉపాధి ప్రభుత్వ సహాయం అవసరం లేని స్థాయికి తీసుకెళ్లగలదు. అందుకే ప్రజలను ఎప్పటికీ 'లబ్ధిదారులు'గా ఉంచడం కంటే స్వయంగా సంపాదించే పౌరులుగా తీర్చిదిద్దడమే నిజమైన సంక్షేమం కావాలన్న వాదన ముందుకు వస్తోంది.

**ఓటు వరకు వరమా?.. జీవితాంతం ఆదాయమా?**

ఎన్నికల ముందు ఎవరు ఎంత నగదు ఇస్తారన్న పోటీ కంటే..

ఎన్ని ఉద్యోగాలు సృష్టించారు?

ఎన్ని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారు?

ఎన్ని ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోంది?

ఎన్ని కుటుంబాల ఆదాయం పెరిగింది?

ఎంతమంది యువత స్వయం ఉపాధి పొందారు?

అన్న అంశాలే రాజకీయ చర్చకు ప్రమాణాలుగా మారాల్సిన అవసరం ఉంది.

**సంక్షేమానికి కాదు.. విచక్షణారహిత ఉచితానికే స్వస్తి!**

పేద వృద్ధుడి పింఛను ఆపడం పరిష్కారం కాదు.

దివ్యాంగుడి భరోసాను తగ్గించడం కాదు.

ఆకలితో ఉన్న కుటుంబానికి ఆహార భద్రతను నిరాకరించడం కాదు.

విద్యార్థి చదువును అడ్డుకోవడం కాదు.

పేదవాడి వైద్య సహాయాన్ని తగ్గించడం కాదు.

అనర్హుడిని తొలగించి.. అర్హుడికి మరింత బలమైన భరోసా ఇవ్వడమే అసలైన సంస్కరణ.

**ప్రభుత్వాలూ.. ఆలోచించండి!**

ప్రతి కొత్త సంక్షేమ పథకానికి ముందు..

ఎంత ఖర్చవుతుంది?

నిధులు ఎక్కడి నుంచి వస్తాయి?

ఎంతకాలం కొనసాగించగలం?

ఎవరికి ఇవ్వాలి?

ఎవరిని మినహాయించాలి?

ఈ పథకం ఐదేళ్ల తర్వాత లబ్ధిదారుడి జీవితాన్ని ఎలా మార్చుతుంది?

అన్న ప్రశ్నలకు ప్రజల ముందే సమాధానం ఉండాలి.

**విశ్వం వాయిస్ ప్రశ్నిస్తోంది...**

చేతికి నగదా?.. చేతికి పనినా?

తాత్కాలిక వరమా?.. శాశ్వత ఉపాధా?

అనర్హుడికీ ఉచితమా?.. అసలైన పేదవాడికే భరోసా?

అప్పులతో పథకాలా?.. ఆదాయంతో అభివృద్ధా?

'ఎంత ఉచితంగా ఇస్తాం?' అనే రాజకీయాల నుంచి

'ప్రతి కుటుంబ ఆదాయాన్ని ఎంత పెంచుతాం?' అనే అభివృద్ధి రాజకీయాల వైపు అడుగులు పడాల్సిన సమయం ఇదే!

# రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాజధాని నిర్మాణంలో ఐదు కాన్సెప్టులు**

"అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్టు అవుతుంది. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్ గా దీనిని తయారు చేస్తున్నాం. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్ స్టాపబుల్. రాజధాని లో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దుష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నాం". అని సీఎం అన్నారు.

**జెండా- సాధించాల్సిన అజెండాతో సంకల్పం**

"2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి. "అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.

# ఏపీ ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తుంది

బాధ్యతలను తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దృష్టి సారించాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు - వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్ లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్ గారితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 150 ఏనుగుల కారిడార్లను దేశవ్యాప్తంగా గుర్తించడం ద్వారా ఏనుగుల ఆవాసాలకు ఇబ్బంది లేకుండా ఉంది. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది. ఏనుగుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కి, ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కి, అప్పటి అటవీ, పర్యావరణ శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ఈ సందర్భంగా మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య సహకారం మాత్రమే కాదు. ఇది ప్రజలు, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ కోసం సాగుతున్న పరస్పర సహకారం. కుంకీ ఏనుగులు ఇప్పటికే మదపుటేనుగులు చేసే విధ్వంసాలను అరికట్టే 15 కార్యకలాపాలలో సహాయపడ్డాయి. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం తగ్గింది. పంట నష్టం కూడా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా సొంత కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. ఇప్పటికే ఒక శిక్షణ పొందిన కుంకీ ఏనుగు జయంత్ పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఉంది. ప్రతి ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనేది మా ప్రణాళిక.

**హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు**

మానవులు - వన్య ప్రాణుల మధ్య నెలకొన్ని ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వేగవంతమైన స్పందన, సాంకేతికత, వణ్య ప్రాణులతో కలిగే నష్ట నివారణ కోసం సమగ్ర మానవ-వన్యప్రాణుల సంఘర్షణ నిర్వహణ వ్యవస్థ అయిన ఎ.గా.చీ.ఖ.వీ.గా.చీ (హనుమాన్) ప్రాజెక్టును 2026, మార్చిలో ప్రారంభించాం. 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి అంబులెన్స్‌లను ఈ ప్రాజెక్టులో సిద్ధం చేశాం. ఇప్పటి వరకు 200కు పైగా వన్యప్రాణులు రక్షించడమే కాకుండా, 30కి పైగా వన్యప్రాణులను తరలింపు కార్యక్రమం జరిగింది. సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజాన్ని దీనిలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి రైతు భయం లేకుండా సాగు చేయగలిగే పరిస్థితికి చేరుకోవాలన్నదే లక్ష్యం. వణ్య ప్రాణులను, ప్రజలను విడదీయడం మా ఉద్దేశం కాదు... ప్రజలు, వన్యప్రాణులు ఒకే ప్రదేశంలో సురక్షితంగా కలిసి జీవించగలిగే భవిష్యత్తును సృష్టించడమే అసలైన విజయం" అని అన్నారు.

**ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్ పుస్తకావిష్కరణ**

అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన "ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్" పుస్తకాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్ గారితో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తోపాటు వైల్డ్ లైఫ్ సైన్స్ కి సంబంధించిన పలు పుస్తకాలను విడుదల చేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో 20 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏనుగుల సంరక్షణ చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన ఒడిశాకి చెందిన క్షేత్ర స్థాయి అటవీ శాఖ అధికారి శ్రీ జుగల్ నాయక్ కు గజ గౌరవ్ అవార్డును అందజేశారు. కుటుంబాలను సత్కరించి, ఏనుగుల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో విశేష కృషి చేసిన, రక్షణ చర్యల్లో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్ గారు, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ తన్మయ్ కుమార్ గారు, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి శ్రీ సుశీల్ కుమార్ అవస్థి గారు, రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే గారు, పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు గారు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ గౌరవ సభ్యులు, భారత ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

**ఇవాళ జైలులో**

# నన్ను కూడా అవమానించారు

రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

**పోలీసులతో కూడా చంద్రబాబు భజన**

# చేయించుకుంటున్నారు

సీఐలు, ఎస్పీలతో ముఖ్యమంత్రే నేరుగా సమీక్షలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. డీజీపీ అసమర్థుడు కావడం వల్లే చంద్రబాబు రంగంలోకి దిగారా అని ప్రశ్నించారు. రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులను అడ్డగోలుగా వాడుకునేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సీఎం ధైర్యసాహసాలను కొందరు అధికారులు కొనియాడటాన్ని నిలదీస్తూ... నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవులను లాక్కోవడమే చంద్రబాబు చూపిన ధైర్యమా అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడుతూ, డాక్టర్ ప్రియాంకను కారుతో తొక్కి చంపిన దారుణ ఘటనను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలను కేవలం ప్రమాదాలుగా చిత్రీకరిస్తూ కొందరు పోలీసుల తీరుతో ఖాకీ దుస్తుల పరువు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ గురించి మాట్లాడే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రియాంక దారుణ హత్యపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణం పేరుతో ఛానళ్లకు భారీగా డబ్బులు ఇస్తూ ప్రచార ఆర్భాటాలకు దిగుతున్నారని, ఎమ్మెల్యే క్వార్టర్లను గొప్పగా చూపుతున్న ప్రభుత్వం... రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎంతమంది ఎమ్మెల్యేలను అందులో ఉంచుతుందో చూద్దామని సెటైర్లు వేశారు. ప్రభుత్వానికి రైతుల భూములు కావాలి కానీ వారి కష్టాలు పట్టడం లేదని, వెంటనే కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా చేసిన ఆరోపణలపైనా పేర్ని నాని ఘాటుగా స్పందించారు. తనపై, తన భార్యపై రూ. 50 కోట్ల ఆరోపణలు చేస్తున్నారని, తాము ఎవరి ఇంటికి వెళ్లామో నిరూపించేలా సీసీటీవీ ఫుటేజీ, ఆధారాలను బయటపెట్టాలని సవాల్ విసిరారు. తాము రూ. 50 కోట్లు ఇచ్చి ఉంటే తమను, ఒకవేళ ఆ డబ్బు చంద్రబాబు తీసుకుని ఉంటే ఆయన్ను జైలులో వేయాలని వ్యాఖ్యానించారు.

# ఖర్గేకు అవమానం..

అభివర్ణించారు. దళితుల పట్ల వివక్ష చూపడమే బీజేపీ సిద్ధాంతమని, కులమతాల మధ్య విభేదాలు సృష్టించడం ఆ పార్టీ మనస్తత్వమని విమర్శించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బీజేపీ పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని ఆమె మండిపడ్డారు. ఇది సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని, రాజ్యాంగ విలువలను తునాతునకలు చేసే ఈ రాక్షస చర్యను యావత్ దేశం ఖండిస్తోందని తెలిపారు. ఈ సిగ్గుమాలిన చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉద్యమిస్తోందని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు షర్మిల ప్రకటించారు. ఆగస్టు 14వ తేదీ సాయంత్రం ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్‌ను స్థానిక అంబేద్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద ముగించి, ఖర్గేకు సంఘీభావంగా సత్యాగ్రహం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని షర్మిల కోరారు. ఇటువంటి వివక్ష, విభజన కుట్రలను దేశ ప్రజలు సహించబోరని బీజేపీకి శక్తివంతమైన సందేశం పంపాలని ఆమె పిలుపునిచ్చారు.

**'లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు**

# నేను దాసుడిని'

నుంచి బహిష్కరించారు" అని రషీద్ మాట్లాడారు. అలాగే సయీద్‌కు తన మద్దతు ప్రకటించారు. అంతటితో ఆగకుండా భారత్‌పై అకారణంగా విషంకక్కారు. రషీద్ 2020 నుంచి 2022 మధ్య ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. భారత్‌లో ఉగ్రకార్యకలాపాలకు పాల్పడేవారి గురించి రషీద్ ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. 26/11 ముంబయి దాడికి పాల్పడిన అజ్మల్ కసబ్ చిరునామాను భారత్‌కు చెప్పింది మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అని గతంలో వ్యాఖ్యలు చేశారు. ఇక, హాఫీజ్‌ను ఐరాస ఇప్పటికే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

**ఆ స్థలాలు ఎక్కడికీ పోవు..**

# నేను హామీ ఇస్తున్నా

కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో కోర్ అర్బన్ ప్రాంత పరిధిలో నిర్మించనున్న 'ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్)' నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ భూముల సమస్యపై కీలక హామీ ఇచ్చారు. "ఏదైనా కారణంగా మీ భూమి 22ఏ జాబితాలోకి చేరితే, కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవు. నేను హామీ ఇస్తున్నా. కోర్టు కేసుల్లో ఉన్న కొంత భూమి కోసం మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టారు. ఆ వివాదాస్పద భూమిని పక్కనపెట్టి, మిగతా వాటికి బై-నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తాం" అని స్పష్టం చేశారు. కూకట్‌పల్లిలో 11 ఎకరాల అత్యంత విలువైన స్థలంలో పేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మించడం గొప్ప సంకల్పమని సీఎం అన్నారు. నగరంలో నిరుపేదలు ఎక్కడ నివసిస్తుంటే అక్కడే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంలో లబ్ధిదారులు ఐదారు లక్షలు భరిస్తే, నిర్మాణ నాణ్యతను పర్యవేక్షించే హక్కు కూడా వారికి ఉంటుందన్నారు. పేదలపై భారం తగ్గించేందుకు ఈ ఇళ్లకు రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా రద్దు చేయాలని వేదికపైనే మంత్రులకు సూచించారు. మొదటి విడతలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఎల్బీనగర్ వంటి వలస కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, గత ప్రభుత్వంలోని ఏ పథకాన్నీ ఆపలేదని, అదనంగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. రెండేళ్లలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. కూకట్‌పల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి తాను రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని, ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

# ఎడిటర్ వాయిస్

## క్వార్టర్స్ రెడీ...
## అమరావతిలో కాపురమే తరువాయి

ఎమ్మెల్యే క్వార్టర్స్ అమరావతి రాజధానిలో సిద్ధం అయ్యాయి. అవి చూస్తే అద్భుతంగా ఉన్నాయి. మహా నగరాలలోని ఏ రాజ ప్రసాదాలకు తీసిపోని విధంగా వాటిని అత్యాధునికంగా నిర్మించారు. అంతే కాదు విశాలమైన ప్రాంగణాలు, క్రీండా వసతులు సహా అన్నీ సమకూర్చి పెట్టారు. ఇవన్నీ చూస్తే అమరావతి రాజధానిలో ఎమ్మెల్యే క్వార్టర్స్ భూతల స్వర్గాన్ని తలపిస్తున్నాయి. ఇప్పటిదాకా ఎమ్మెల్యేలు అంతా అమరావతికి రావాలంటే విజయవాడలో బస చేసి వస్తూండేవారు. లేదా తామున్న ప్రాంతం నుంచి వచ్చి వెళ్ళిపోతూండేవారు, ఇపుడు ఆ బాధ అయితే లేదని అంటున్నారు.

**మొత్తం సిద్ధంగానే :** ఇదిలా ఉంటే అమరావతి రాజధానిలో నిర్మాణం పూర్తైన ఎమ్మెల్యే ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని చంద్రబాబు తాజాగా పరిశీలించి పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీల నివాస భవన సముదాయం నిర్మించబడింది. ఒక్కోక్కటీ 3500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను నిర్మించి సీఆర్డీఏ శభాష్ అనే తీరుని చాటుకుంది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి పరిశీలించిన చంద్రబాబు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రాజధానికి సరి కొత్త హంగులు ఏర్పడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్ ని పరిశీలిస్తూ అక్కడ నిర్మాణాల తీరుని గమనించి హర్షం వ్యకం చేశారు.

**అన్ని రకాల సదుపాయలతో :** ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇక అమరావతిలో కాపురం ఉండేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు, ఆకాశాన్ని అందుకునేలా అన్ని రకాల సదుపాయలతో నిర్మించిన ఈ క్వార్టర్స్ ని చూసిన వారు ఎవరూ విడిచి ఉండేది లేదు. మరో వైపు చూస్తె రాజధాని నగరంలో ప్రజా ప్రతినిధులకు క్వార్టర్స్ ఇవ్వడం సబబు. కానీ విభజన తరువాత ఏపీకి సరైన రాజధాని లేకపావడంతో పుష్కర కాలంగా ప్రజా ప్రతినిధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇపుడు వారి కష్టాలు తీరబోతున్నాయి అని అంటున్నారు.

**వారు గృహ ప్రవేశం చేస్తే :** ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు గృహ ప్రవేశం చేస్తే కనుక అమరావతి రాజధాని ప్రజా రాజధానిగా మారడానికి తొలి అడుగు పడుతుంది. ఆ మీదట మిగిలిన భవనాలు కూడా సిద్ధం అయి మొత్తం అన్ని రకాలైన సిబ్బంది అడుగు పెడతారు. అలాగే మంత్రుల క్వార్టర్స్ కూడా రెడీ అవుతోంది. దాంతో రాజధానిలో అధికార అలికిడి సందడి నెలకొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు.

**నిర్మాణంలో మొదటి మెట్టు :** ఇదే సందర్భంలో సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని ఆయన స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ మంగళగిరి గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ 3ని ఆయన ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా బాబు ప్రారంభించారు. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. ఇవన్నీ చూసిన తరువాత రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్ అని బాబు వ్యాఖ్యానించారు.

**ప్రత్యేకంగా ఉండాలనే :** అమరావతి రాజధానిలో ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించామని చంద్రబాబు చెప్పారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశామని అన్నారు. అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసిందని చెప్పారు. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్ గా దీనిని తయారు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నామని బాబు గుర్తు చేశారు. నో పోల్స్ బ్లూ గ్రీన్ గ్రీన్ ఎనర్జీ క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోందని అన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ అయిదు నగరాల్లో ఒకటిగా తయారవుతుందని బాబు విశ్వాసం వ్యక్తం చేశారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్


## పాపం చిన్నారి.. చెట్టుకొమ్మ బలితీసుకుంది



### భువనగిరి బాగాయిత్ స్కూల్ ఆవరణలో ఘటన

**భువనగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులపై వేప చెట్టు కొమ్మ విరిగి పడటంతో ఒక విద్యార్థిని మృతిచెందగా మరికొంతమంది గాయపడ్డారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రం భువనగిరిలో గురువారం జరిగింది. పట్టణంలోని బహార్‌పేటలో బాగాయిత్ స్కూల్ ఆవరణలోని మైదానంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో మూడో తరగతితోపాటు ఇతర విద్యార్థులు కొంతమంది ఆడుకుంటున్నారు. ఒక వేప చెట్టు మొదలు పైభాగాన మధ్యలో కాల్చి ఉండటంతో రంధ్రం పడి ఉంది. చెట్టుకు ఆధారం లేకపోవడంతో కొమ్మ విరిగి కింద కూలింది. అదే సమయంలో అక్కడ ఆడుకుంటున్న విద్యార్థులు పరుగులు తీశారు. కానీ, మూడో తరగతి విద్యార్థిని హలీమా(10)తో పాటు హర్షిత్‌పైన కొమ్మ పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఐదుగురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థుల కేకలతో ఉపాధ్యాయులు, స్థానికులు అక్కడికి చేరుకొని కొమ్మలను తొలగించి హలీమాను ప్రభుత్వ ఆసుపత్రికి... అక్కడి నుంచి ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన హర్షిత్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. స్వల్పంగా గాయపడిన విద్యార్థులకు జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. హలీమా తండ్రి దావూద్‌అలీ పట్టణంలో ప్లంబర్. ఈయనకు హలీమాతోపాటు ఇద్దరు కుమారులు, మరో కుమార్తె ఉన్నారు. హలీమా సోదరుడు ఇదే పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. ఘటనా స్థలాన్ని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఎస్పీ రవీందర్, పురపాలిక ఛైర్‌పర్సన్ శ్రీవాణి పరిశీలించారు.

## ప్రియురాలిని హత్య చేసి తగులబెట్టిన ప్రియుడు



### భర్తతో గర్భం దాల్చిందని... నాగర్‌కర్నూల్ జిల్లాలో దారుణ ఘటన

**వెల్దండ, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్తను వదిలేసి వస్తానని చెప్పి రాకపోగా.. గర్భం దాల్చడంతో కోపం పెంచుకున్న ప్రియుడు ఆమెను పాశవికంగా హత్య చేసి, నిప్పంటించి దహనం చేసిన దారుణ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... కొట్ర గ్రామానికి అనూష(24), అదే గ్రామానికి చెందిన నారమళ్ల చెన్నయ్య ఆరేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆమె కల్వకుర్తి పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్‌లో, భర్త ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. వారికి ఐదేళ్ల కుమారుడు మోక్షిత్ ఉన్నారు. మరోవైపు ఆమె నాలుగేళ్లుగా గ్రామానికి చెందిన యువకుడు శ్యాంపూరి రాములుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. చెన్నయ్యకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, అతన్ని వదిలేసి తనతో వచ్చేస్తానని చెప్పి కాలయాపన చేస్తుండటంపై అనూషతో రాములు గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో అనూష రెండు నెలల గర్భిణి అని తెలియగా.. తనతో వచ్చేస్తానని చెప్పి భర్తతో సంసారం చేస్తోందని మరింత కక్ష పెంచుకున్నాడు. దీంతో ఆమెను మట్టుబెట్టాలని నిర్ణయించుకొని, కొట్రకు చెందిన తన అల్లుడు నాయిని శ్రీనుతో కలిసి పథకం రచించాడు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి బయలుదేరిన అనూషను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై కొట్ర శివారులోని తన చిన్నాన్న చిన్నరుక్కులు పొలంలోకి తీసుకెళ్లాడు. కాసేపటి తరువాత నాయిని శ్రీనును పిలిపించాడు. ఇద్దరూ కలిసి అనూష మెడకు చున్నీ బిగించి హత్య చేశారు. అనంతరం ఇద్దరూ కలసి మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై ఉంచి వడ్డెరోనికాళ్ల వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడే ముందే సిద్ధం చేసి ఉంచిన కట్టెలపై అనూష మృతదేహాన్ని ఉంచి, డీజిల్ పోసి నిప్పంటించారు. అనంతరం ఇళ్లకు వెళ్లి స్నానాలు చేసి, తిరిగి ఘటనా స్థలానికి వచ్చి మృతదేహం పూర్తిగా కాలిపోయిందా..? లేదా..? అని పరిశీలించారు. ఆపై నేరుగా వెల్దండ పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు.

## పట్టా మార్పిడికి రూ.40 వేల లంచం

### ఏసీబీకి చిక్కిన ఆర్ఐ



**సారంగాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టా మార్పిడి కోసం రూ.30 వేల లంచం తీసుకుంటూ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన మహిళ కొంతకాలంగా బీర్‌పూర్ మండలం సిరిపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఎస్సారెస్పీ హనరావాస గ్రామాలైన గంగసముద్రం, నూతుపల్లి, మోతీనగర్ ప్రాంతాల్లో 4 గుంటల చొప్పున 12 గుంటల స్థలాన్ని ఇతరుల నుంచి కొనుగోలు చేశారు. సాదాబైనామా ద్వారా తన పేరిట పట్టా మార్పిడి చేయాలని ఆమె 2025 జులై 12న తహసీల్దారుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు విచారణ చేపట్టాలని ఆర్ఐ రాహుల్‌ను తహసీల్దారు ఆదేశించారు. అప్పటి నుంచి విచారణ పేరిట ఆర్ఐ జాప్యం చేస్తూ వస్తున్నారు. రూ.50 వేలు ఇస్తేనే పట్టా మార్పిడి చేయిస్తానని ఇటీవల డిమాండ్ చేయగా... రూ.40 వేలకు ఒప్పందం కుదిరింది. ముందుగా రూ.30 వేలు, పని పూర్తయ్యాక మరో రూ.10 వేలు ఇస్తానని బాధితురాలు చెప్పారు. అనంతరం ఆమె ఏసీబీని ఆశ్రయించారు. గురువారం తన ఇంటికి వచ్చి చెప్పిన మొత్తం తీసుకెళ్లాలని కోరగా.. ఆర్ఐ వెళ్లి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

## భర్తను షాకులిచ్చి చంపి.. దొంగలపై నెపం

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దక్షిణ దిల్లీలోని సంగమ్ విహార్ ప్రాంతంలో ఓ మహిళ తన భర్తను ప్రియుడి సాయంతో అత్యంత కిరాతకంగా హత్య చేసింది. తాడుతో అతడి గొంతు నులిమి, విద్యుత్తు షాకులిచ్చి, కర్రతో కొట్టి హత్య చేశారు. ఈ నెల పదో తేదీన దక్షిణ దిల్లీ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం రోడ్డుపై పడున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. మృతుణ్ని రియల్ ఎస్టేట్ ఏజెంటు మున్నాలాల్ (55)గా గుర్తించారు. మృతదేహంపై పలుచోట్ల గాయాలున్నాయి. ఇంట్లోకి చొరబడిన దొంగలు ఎదురుతిరిగిన తన భర్తను హత్య చేశారని మున్నాలాల్ భార్య మంజు అలియాస్ నాజియా (45) పోలీసులకు తెలిపింది. ఇంటి బయటున్న సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా.. ముసుగు ధరించిన ఓ వ్యక్తి రాత్రి 1.45 గంటలకు ఇంట్లోకి ప్రవేశించి, 3.15 గంటలకు బయటకు వెళ్లినట్లు రికార్డయింది. అనుమానం వచ్చిన పోలీసులు నాజియాను నిలదీయగా నేరాన్ని అంగీకరించింది. తాగునీటిలో మత్తుమందు కలిపి ఇచ్చి అపస్మారక స్థితికి వెళ్లాక హత్య చేసినట్లు తెలిపింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. భర్తను చంపితే రూ.5 లక్షలు ఇస్తానని నాజియా తన ప్రియుడు చమన్ (20)కు హామీ ఇచ్చింది. హత్య అనంతరం రూ.20,000 ముట్టజెప్పింది. ఈ హత్యకు కిషన్ (28) అనే మరో వ్యక్తి సహకరించాడు. నిందితులు ముగ్గురినీ అరెస్ట్ చేసినట్లు డీసీపీ అనంత్ మిత్తల్ తెలిపారు.



# ఓటర్ల జాబితా సవరణ గడువులోగా పూర్తి చేయాలి

**పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ప్రక్రియ చేపట్టాలి - ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు**

**అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, తప్పులు లేని ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలని సూచించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో దృశ్య సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పురోగతిని సమీక్షించారు. నోటీసుల జారీ, వాటి పంపిణీ, బూత్ స్థాయి అధికారుల సమావేశాల వివరాల నమోదు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ముసాయిదా ఓటర్ల జాబితాల పంపిణీ, ఫారం--6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ప్రచార కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను జిల్లాల వారీగా సమీక్షించారు.

**1,822 పోలింగ్ కేంద్రాల్లో ప్రక్రియ**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కాకినాడ జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివరాలను వెల్లడించారు. జిల్లాలోని 1,822 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి నోటీసుల జారీతో పాటు బూత్ స్థాయి అధికారుల సమావేశాల వివరాల నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 31,695 నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 7,335 నోటీసులు సంబంధిత వ్యక్తులకు అందజేశామన్నారు. మిగిలిన 24,360 నోటీసుల పంపిణీని వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

**ఫారం-6, 7, 8 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 కింద 7,724 దరఖాస్తులు, ఓటరు తొలగింపుపై అభ్యంతరాలకు సంబంధించిన ఫారం-7 కింద 219 దరఖాస్తులు, ఓటరు వివరాల సవరణ లేదా చిరునామా మార్పునకు సంబంధించిన ఫారం-8 కింద 5,174 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అర్హతల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితాలోని తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైతే సవరణలు చేయించుకోవాలని కోరారు.

**48 గంటల్లో కాల్స్ పరిష్కారం**

బూత్ స్థాయి అధికారితో మాట్లాడేందుకు అందుబాటులో ఉన్న సేవ ద్వారా వచ్చిన 18 కాల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 48 గంటల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే సంబంధిత పోర్టల్‌లో నమోదైన 17 ఫిర్యాదులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు జారీ చేసిన వ్యక్తుల జాబితాలను ప్రజల సౌకర్యార్థం సంబంధిత పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలతో పాటు ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తున్నట్లు వివరించారు.

**ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు**

ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదుకు ఆగస్టు 30 వరకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. వాటిని సెప్టెంబరు 28లోగా పరిష్కరించి, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ దృశ్య సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, ఆర్డీవోలు ఎస్. మల్లిబాబు, పి. కృష్ణమూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగన్నాథం, బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు శ్రీనివాసరావు, ఇతర ఎన్నికల విభాగాధికారులు పాల్గొన్నారు.

## చోరీకి వచ్చాడు..

# నిద్రపోయి చిక్కాడు

**పహాడీషరీఫ్, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** చోరీ చేసేందుకు ఓ ఇంట్లో దూరిన దొంగ అక్కడే దర్జాగా నిద్రపోయి పట్టుబడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జల్‌పల్లి వాది ఎ ముస్తఫా బస్తీలో ఉండే షోయబ్(19) ఎలియాస్ ఫుర్ఖాన్ మద్యానికి బానిసై, తాగేందుకు డబ్బుల కోసం చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతుంటాడు. గురువారం వేకువజామున 4.30 గంటలకు తానుండే వీధిలోనే నజ్మొద్దీన్ ఇంట్లోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులంతా ఓ గదిలో నిద్రిస్తుండగా మరో పడక గదిలోకెళ్లి అల్మారా తెరిచాడు. బంగారం పూత పూసిన ఇత్తడి నగలు, గాజులతో పాటు ఓ సెల్‌ఫోన్‌ని జేబులో పెట్టుకున్నాడు. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు కాసేపు అక్కడే నిద్రపోయి తర్వాత లేచి వెళ్లిపోదామని అనుకున్నాడు. మంచం పక్కనే నేలపై వాలి గాఢ నిద్రలోకి జారుకున్నాడు. నజ్మొద్దీన్ కుటుంబ సభ్యులు ఉదయం 7 గంటలకు ఆ గదిలోకి వచ్చి చూసి.. స్థానికులతో పాటు పహాడీషరీఫ్ పోలీసులకు సమాచారం అందించారు. చోరీ చేశాక మత్తులో నిద్రపోయానని షోయబ్ అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి.. అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


విశ్వంవాయిస్ / విశ్వం VOICE TV

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- 📰 రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS

WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW


లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.


## కాకినాడ రూరల్‌లో

# 'ఇంటింటికి తెలుగుదేశం'కు అపూర్వ స్పందన

**జాతీయ జెండాతో వాకలపూడి నుంచి సర్పవరం జంక్షన్ వరకు 'తిరంగా యాత్ర'**



**కాకినాడ రూరల్, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ జెండాను చేతబట్టి దేశభక్తి నినాదాలతో సాగిన 'తిరంగా యాత్ర', అనంతరం ప్రజలతో మమేకమైన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంతో వాకలపూడి, వలసపాకల ప్రాంతాల్లో సందడి నెలకొంది. టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు తొలుత వాకలపూడి గ్రామంలో జాతీయ జెండాలను చేతబట్టి నడుస్తూ తిరంగా యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి వలసపాకల మీదుగా సర్పవరం జంక్షన్ వరకు కారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వలసపాకల గ్రామంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇద్దరు లబ్ధిదారులకు మొత్తం రూ.2.50 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కలిసి అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కేశబోయిన ఏడుకొండలు, క్లస్టర్ కన్వీనర్ తాతపూడి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి, మాజీ పిఎస్సి చైర్మన్ కొల్లిబోయిన సూరిబాబు, పడమటి వీరబాబు, దేవత రామచల్మాజీ, అచ్యుత్, శ్రీను, వర్మ సత్యనారాయణ స్థానిక కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, వలసపాకల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

**కోటనందూరు మండలంలో పర్యటించిన జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్**





**కోటనందూరు, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్ అన్నారు. గురువారం కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో అల్లిపూడి లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యాలయాలను సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి పఠనా శక్తిని పరిశీలించారు. విద్యార్థులు అధ్యయన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి పలు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖా అధికారులు శ్రీనివాసరావు, రామ శేఖర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15, 2026
# దేశభక్తి గేయం

ఆగష్టు 15, 2026 : "భారత స్వాతంత్ర్య దినోత్సవం" సందర్భంగా పాడుకునే "దేశ భక్తి" గేయం

ఆ ఆ ఆ....... ఓఓఓ........
ఆ ఆ ఆ........ ఓఓఓ......

**పల్లవి**
భరత భూమికి వందనం
భారత మాతకు వందనం
అందుకొనుము మా వందనం
సుధా మధుర గానామృతం

**చరణం : 1**
ఎందరెందరి ప్రాణార్పణతో
నిట్టూర్పు వదలి ఊపిరి పీల్చి
బానిస సంకెళ్ళు పెళ పెళా తెగి
స్వేచ్ఛా స్వాతంత్రం పొందిన
భరత మాతా నీకు వందనం
అందుకొనుము మా పాదాభివందనం

భరత భూమికి వందనం
భారత మాతకు వందనం

**చరణం : 2**
తుపాకీ గుళ్ళకు బలియైన గాంధీజీ
జాతి పితయై, మహాత్ముడై ఇల నిలువగా
చాచాజీ నెహ్రూజీ ప్రథమ ప్రధానియై
భారత దేశ నిర్మాణ సారథి కాగా
సాగుచున్నది భరత భూమి అభివృద్ధి పథాన
నిలువ నున్నది ప్రపంచ శిఖరాన

భరత భూమికి వందనం
భారత మాతకు వందనం

**చరణం : 3**
వందేమాతర గేయం స్వాతంత్ర్య స్ఫూర్తి నిలుపగా
భారతీయుల జీవన వేదమై, నాదమై నిలువగా
జాతీయ గేయమై నాడు, నేడు ప్రతిధ్వనింపగా
జన గణ మన జాతీయ గీతమై, హృదయ తరంగమై
మృదంగమై పలుకుచున్నదీ
ప్రణతులందుకొనుచున్నదీ

భరత భూమికి వందనం
భారత మాతకు వందనం

**చరణం : 4**
స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణార్పణతో
దాస్య శృంఖలాల విచ్ఛేదనతో
స్వేచ్ఛా స్వాతంత్ర్య సముపార్జనతో
ఊపిరి పీల్చుకున్న నా భరతమాత
ఆనందంతో ఉప్పొంగగా
ఉత్తుంగ తరంగమై ఎర్రకోటపై ఎగురుచున్నది
ముచ్చటైన మన మువ్వన్నెల జెండా
అంబరాన్ని అంటుతూ గర్వంగా ఎగురుచున్నది
భారతీయుల హృదయ పీఠములపై నిలచియున్నది
స్థిరముగా ఎగురుచున్నది
మన మువ్వన్నెల జెండా

భరత భూమికి వందనం
భారత మాతకు వందనం
అందుకొనుము మా వందనం
లిసుధా మధుర గానామృతం.




దేశభక్తి గేయ రచన : కోట రామ ప్రసాద్, రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ & సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్, గేయ రచయిత, ఉండ్రాజవరం మండలం, పాలంగి గ్రామం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం. వాట్స్ ఆప్ నెంబర్ : 93475 03536, 89195 72779.





కువైట్‌లో భారతీయుల సమస్యలపై

# ఇండియన్ అంబాసిడర్‌కు 'జై భీమ్ యూత్' వినతి



**రామచంద్రపురం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** కువైట్‌లో స్థిరపడిన భారతీయులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం 'జై భీమ్ యూత్ కువైట్' గ్రూప్ ప్రతినిధులు శుక్రవారం భారతీయ అంబాసిడర్‌ను (రాయబారి కార్యాలయ అధికారులను) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కువైట్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న భారతీయ మహిళలు, డ్రైవర్లు, ఎడారి ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు పడుతున్న తీవ్ర ఇబ్బందులను అంబాసిడర్ దృష్టికి సవివరంగా తీసుకెళ్లినట్లు గ్రూప్ అధ్యక్షుడు భాషా, ఉపాధ్యక్షుడు అజయ్, కార్యదర్శి నాని, జక్కల సురేష్‌లు స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా వెల్లడించారు. ఈ వినతిపై ఇండియన్ అంబసీ అధికారులు ఎంతో సానుకూలంగా స్పందించారని గ్రూప్ సభ్యులు తెలిపారు. కువైట్‌లో ఉన్న భారతీయులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వెంటనే అంబసీని గానీ, తమ ప్రతినిధులను గానీ సంప్రదించాలని, బాధితులకు తగిన న్యాయం మరియు సహాయ సహకారాలు అందించేందుకు పూర్తినైతిక మద్దతు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాయబార కార్యాలయం చూపిన శ్రద్ధ మరియు స్పందన పట్ల జై భీమ్ యూత్ గ్రూప్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అంబాసిడర్‌ను కలిసిన వారిలో గ్రూప్ కోశాధికారి రాజు, సహాయ కార్యదర్శి మణి, సలహాదారులు వినోద్, సత్తిబాబు, శ్రీను, కార్యవర్గ సభ్యులు దివాకర్, సురేష్, చిన్నోడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో పలు కంపెనీలకు 25 మంది ఎంపిక




**రామచంద్రపురం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలన కోసం రామచంద్రపురం ఉపాధిభవన్లో నిర్వహించిన 46వ జాబ్ మేళాలో వోల్టాస్ కంపెనీకి 17 మంది, అపోలో టైర్స్ కి 8 మంది మొత్తం 25 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులైన వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగింది. ఎంపికైన అభ్యర్థులందరూ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఉపాధి అధినేత రామ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# అవయవ దానం.. మరొకరికి పునర్జన్మ

**మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ - ఎస్పీ కార్యాలయం నుంచి భానుగుడి జంక్షన్ వరకు భారీ ప్రదర్శన**

**విద్యార్థుల ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్ - అవయవ దానంపై అపోహలు వీడాలి : జిల్లా ఎస్పీ బిందు మాధవ్**







**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** అవయవ దానం ద్వారా మరొకరి జీవితానికి పునర్జన్మ ప్రసాదించవచ్చని, ఈ మహోన్నత కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ఆధ్వర్యంలో గురువారం నగరంలో అవగాహన ర్యాలీ, ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఎస్పీ కార్యాలయం నుంచి భానుగుడి జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. కె. అనిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అవయవ దానం ద్వారా మరొకరికి కొత్త జీవితాన్ని అందించే గొప్ప అవకాశం లభిస్తుందన్నారు. సమాజంలో అవయవ దానంపై మరింత చైతన్యం పెరగాలని, ముఖ్యంగా యువత ఈ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుడా చైర్మన్ సత్య తలాటం మాట్లాడుతూ, అవయవ దానం మహోన్నతమైన సేవ అని పేర్కొన్నారు. మనిషి మరణానంతరం కూడా మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం అవయవ దానం ద్వారా లభిస్తుందన్నారు. ప్రజలు అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించుకుని స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. యువతలో అవగాహన పెంచేందుకు మెడికవర్ హాస్పిటల్స్ చేపట్టిన ర్యాలీ, ఫ్లాష్‌మాబ్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అభినందించారు. మెడికవర్ హాస్పిటల్స్ యూరాలజిస్ట్ డా. కల్యాణ్ బాబు, నెఫ్రాలజిస్ట్ డా. రాజా అమరేంద్ర, అనస్థీషియా విభాగం వైద్యుడు డా. కిషోర్ బాబు మాట్లాడుతూ అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. అవయవ దానం ద్వారా అవసరంలో ఉన్నవారికి ప్రాణదానం చేసే అవకాశం ఉంటుందని, దీనిపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ల ఆంజనేయస్వామి (అంజిబాబు) మాట్లాడుతూ, అవయవ దానంపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు నిరంతర అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. ఒక వ్యక్తి తీసుకునే అవయవ దాన నిర్ణయం ద్వారా అనేక కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు తమ ప్రదర్శన ద్వారా అవయవ దానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది, ఆదిత్య కళాశాల, ఆదర్శ కళాశాలతో పాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "అవయవ దానం - మరొకరికి పునర్జన్మ" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం నగర ప్రజల్లో అవయవ దానంపై చైతన్యం కల్పించింది.

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# ఘనంగా 'తిరంగా ర్యాలీ'



**రామచంద్రపురం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టిబాబు ఆధ్వర్యంలో 'తిరంగా ర్యాలీ' శుక్రవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెం డాలను చేతబూని, దేశభక్తి నినాదాలు చేస్తూ, జాతీయ గీతాలు ఆలపిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీ రామచంద్రపురంలో విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టిబాబు మాట్లాడుతూ జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని ఉద్ఘాటించారు. యువత మరియు విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చుకొని దేశాభివృద్ధిలో చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ర్యాలీని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ ఎన్. వి. రమణ, డాక్టర్ ఎన్. సుజాత, శ్రీ రవి బాబు, రఘురాంలతో పాటు పలువురు అధ్యాపక, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల గొడవపై

# పోలీసుల కౌన్సెలింగ్

**సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోపై వన్ టౌన్ పోలీసుల స్పందన**

**తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**



**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాఠశాల విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి గొడవకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు వన్ టౌన్ సీఐ ఎం. నాగ దుర్గారావు సంబంధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పరదేశమ్మపేట మున్సిపల్ హైస్కూల్, ఘాటీ సెంటర్ హైస్కూల్‌కు చెందిన కొంతమంది విద్యార్థులు శివాలయం వీధిలోని డాక్టర్ బసవయ్య ఆయుర్వేద ఆసుపత్రి సమీపంలోని ట్యూషన్ కేంద్రానికి వెళు తున్నారు. ట్యూషన్ ముగిసిన అనంతరం పార్కింగ్ చేసిన సైకిళ్లను తీసుకునే సమయంలో విద్యార్థుల మధ్య చిన్నపాటి వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. విషయం పోలీసుల దృష్టికి రావడంతో సంబంధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సీఐ నాగ దుర్గారావు మాట్లాడారు. చిన్న విషయాలకు గొడవలకు దిగకుండా పరస్పరం స్నేహభావంతో మెలగాలని, చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆధారాలు లేకుండా తప్పుడు సమాచారం, తప్పుదోవ పట్టించే పోస్టులు లేదా వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం, ఇతరులకు పంపించడం వల్ల చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అనుమానాస్పద సమాచారం లేదా వీడియోలు కనిపించినప్పుడు వాటిని నిర్ధారించుకోకుండా పంచుకోవద్దని, అవసరమైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని వన్ టౌన్ పోలీసులు కోరారు.

# చాలా కాలంగా అవార్డులు ఇవ్వడం లేదు

## ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



అమరావతి చిత్రకళా వీధి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అవార్డుల పునరుద్ధరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాల హయాంలో ఉగాది పురస్కారాలతో పాటు పలు రంగాలకు చెందిన అవార్డులు నిలిచిపోయాయని ఒప్పుకున్న ఆయన, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ పురస్కారాలన్నింటినీ తిరిగి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువతలో ఉన్న కళాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాలా మద్దతు ఇస్తుందని, కళారంగాన్ని ఆదరించే వారికి సరైన అవకాశాలు కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా 2017 నుండి పెండింగ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక -నంది అవార్డుల- పునరుద్ధరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారని మంత్రి కందుల దుర్గేష్ ధృవీకరించారు. సినీ పరిశ్రమ పెద్దలతో జరిపిన విస్తృత చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. చలనచిత్ర రంగానికి ఇచ్చే నంది అవార్డులతో పాటు బుల్లితెర (టీవీ) అవార్డులు, నంది నాటకోత్సవాలు.. కందుకూరి థియేటర్ పురస్కారాలను కూడా ఒకేసారి పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాంప్రదాయ పద్ధతిలోనే అవార్డులు ఇవ్వాలా లేదా ఆధునిక మార్పులతో కేటగిరీలను సరిదిద్దాలా అనే అంశంపై ప్రభుత్వం ప్రస్తుతం సమీక్ష నిర్వహిస్తోంది. అయితే ప్రభుత్వం కేవలం అవార్డుల ప్రకటనలకే పరిమితం కాకుండా నాటకరంగం, బుల్లితెర, సినీ పరిశ్రమలోని వృద్ధ కళాకారుల సంక్షేమంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్టేజ్ డ్రామా-థియేటర్ ఆర్టిస్టులకు పింఛన్లు, స్టైఫండ్లు అందించి ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనే ప్రాక్టికల్ విషయాలపై మంత్రి స్పందిస్తే బాగుండేదని కళాకారులు భావిస్తున్నారు. కనీసం నిరుపేద కళాకారులు స్వగృహం ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఆరోగ్య భద్రత కల్పించడం వంటి క్షేత్రస్థాయి సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. గత కొన్నేళ్లుగా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా అవార్డులు ఇవ్వకపోవడంతో సినీ వర్గాల్లోనూ, కళాకారుల్లోనూ వీటిపై ఆసక్తి బాగా తగ్గిపోయింది. పురస్కారాలను సకాలంలో ప్రదానం చేయకపోవడం వల్ల అవార్డులు తీసుకోవాలనే ఉత్సాహం కళాకారుల్లో నీరుగారిపోయిందనే విమర్శలు ఉన్నాయి. ఏళ్లుగా బకాయి ఉన్న నంది అవార్డులను 2026 నాటికి పూర్తిస్థాయిలో పారదర్శకంగా ప్రదానం చేస్తారా లేదా అనే దానిపై ఇండస్ట్రీలో ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. గత ప్రభుత్వంపై సాకులు చెప్పడం కంటే...ప్రస్తుత ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో వీటిని నిర్వహిస్తుందనేదే ఇప్పుడు ముఖ్యం. మరోవైపు నంది అవార్డుల ప్రదానంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో స్థానికంగా సినిమా రంగ అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ కొత్త టాలీవుడ్ ఎక్కడ నెలకొల్పుతారో సినిమాటోగ్రఫీ మంత్రికి అయినా క్లారిటీ ఉంటే బావుండేదని కూడా నెటిజనులు సెటైర్లు వేస్తున్నారు. స్టూడియోలు, డబ్బింగ్ రికార్డింగ్ థియేటర్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిచ్చేలా ఒక నూతన -ఫిల్మ్ పాలసీ-ని తీసుకురావడానికి ప్రభుత్వం ఎలాంటి కమిట్‌మెంట్ తో ఉంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవార్డులను మళ్లీ పట్టాలెక్కించడంతో పాటు విశాఖపట్నం, అమరావతి లేదా గోదావరి-కృష్ణ బేసిన్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వసతులు పెంచితేనే ఏపీలో సినిమా రంగానికి పూర్వ వైభవం వస్తుంది. కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా కళాకారుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం ఈ చర్యలను ముందుకు తీసుకెళ్లాలని కళాలోకం ఆశిస్తోంది.




# పింఛన్ల పంపిణీలో ప్రజా సంతృప్తి 100 శాతానికి చేరాలి

**లబ్ధిదారుల ఇంటి వద్దకే పారదర్శకంగా పింఛన్ అందించాలి - సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలి.. ఎలాంటి నగదు స్వీకరించరాదు**

**పింఛన్ నిధుల్లో అక్రమాలకు పాల్పడితే తొలగింపుతో పాటు క్రిమినల్ కేసులు : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించి, వచ్చే నెల నాటికి ప్రజా సంతృప్తి స్థాయిని నూరు శాతానికి తీసుకెళ్లే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పింఛన్ల పంపిణీపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు అండగా నిలిచే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వారి ఇంటి వద్దకే తీసుకెళ్లి పారదర్శకంగా అందించాలని సూచించారు. పింఛన్ పంపిణీ సమయంలో సిబ్బంది లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పింఛన్ అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు స్వచ్ఛందంగా నగదు ఇవ్వడానికి ప్రయత్నించినా పంపిణీ చేసే సచివాలయ సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించరాదని హెచ్చరించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో పూర్తి నమ్మకం, సంతృప్తి కలిగే విధంగా సిబ్బంది పనిచేయాలని పేర్కొన్నారు. గత నెలతో పోలిస్తే ప్రస్తుత నెలలో ప్రజా సంతృప్తి స్థాయిలు తగ్గినట్లు గుర్తిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. లబ్ధిదారుల ఫోన్ నంబర్లు సక్రమంగా నమోదయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక



తనిఖీలు నిర్వహించి పింఛన్ పంపిణీ విధానం, సిబ్బంది ప్రవర్తన, నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. పింఛన్ నిధుల దుర్వినియోగానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులను కాజేసినట్లు నిర్ధారణ అయితే సంబంధిత సచివాలయ సిబ్బంది నుంచి మొత్తం సొమ్మును రికవరీ చేయడంతో పాటు వారిని విధుల నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను కలెక్టరేట్‌కు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శ్రీనివాసరావు, జిల్లా అభివృద్ధి అధికారి పి. వాసుదేవరావు, జిల్లా స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు నోడల్ అధికారి జె. వేణుగోపాల్, పలువురు ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు

# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**పోలీసు కవాతు మైదానంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో ఎస్.మల్లిబాబు**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి కాకినాడ పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు గురువారం



పరిశీలించారు. వేడుకల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు తదితరులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్. మల్లిబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేడుకలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా లోపాలకు తావులేకుండా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి మరోసారి పరిశీలించాలని సూచించారు. ఈ పరిశీలనలో కాకినాడ అర్బన్ తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవాని రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాకినాడ జీజీహెచ్‌పై రెపరెపలాడిన జాతీయ పతాకం

**దేశభక్తి స్ఫూర్తితో నర్సింగ్ సిబ్బంది ర్యాలీ - జాతీయ సమైక్యతను చాటిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం**





**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో గురువారం దేశభక్తి స్ఫూర్తితో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్" కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్య కుమారి ఆధ్వర్యంలో జీజీహెచ్ భవనంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నర్సింగ్ విభాగం సిబ్బంది చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో సాగిన ర్యాలీ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ పతాకం పట్ల గౌరవం, దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను మరింత పెంపొందించడంతో పాటు ప్రజాసేవ పట్ల వైద్య, నర్సింగ్ సిబ్బందిలో బాధ్యతను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్య కుమారి, సీఎస్ఆర్ఎంఓ జి. మెహర్ కుమార్, ఏఆర్ఎంఓ లావణ్య, సంబంధిత అధికారులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15న కోర్టు ప్రాంగణాల్లో వనమహోత్సవం

**పర్యావరణ పరిరక్షణకు న్యాయశాఖ ప్రత్యేక కార్యక్రమం**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు న్యాయస్థానాల్లో మొక్కల నాటడం..**

**ప్రజలు, అధికారులు, మీడియా ప్రతినిధులు భాగస్వాములు కావాలి**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపు**




**రాజమహేంద్రవరం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆగస్టు 15న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా న్యాయస్థానాల ప్రాంగణాల్లో 'వనమహోత్సవం' నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో విస్తృతంగా మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని కోర్టు సముదాయాలు, వివిధ న్యాయస్థానాల ప్రాంగణాలు, న్యాయమూర్తుల నివాస గృహాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట, ఆలమూరు, ప్రత్తిపాడు, ముమ్మిడివరం, తుని, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో ఈ వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వివరించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అధికారులు, మీడియా ప్రతినిధులు భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు.

### 36 సంవ్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న

# ఉపాధ్యాయుడికి అభినందనలు వెల్లువ








**కోటనందూరు, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** నేటితో ఉపాధ్యాయ వృత్తిలో 36 సంవత్సరములు సర్వీస్ పూర్తి చేసుకున్న కనిగిరి విశ్వేశ్వరరావును పలువురు ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, గంగవరం మండలం, జడేరు గ్రామం మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో కనిగిరి సుబ్బారావు, కృష్ణవేణి దంపతులకు 14-03-1969 తేదీన కనిగిరి విశ్వేశ్వరరావు జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు విద్యలో ఘనంగా రాణించారు. తాను పుట్టిన జడేరు గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం, అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్య, రంపచోడవరంలో ఇంటర్మీడియట్, కాకినాడ పీఆర్, కాలేజ్ పైడా అండాలమ్మ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లీష్, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగు, న్యాయ శాస్త్రం ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నంలో బిఈడి శ్రీకృష్ణదేవరాయల యూనివర్సిటీలో చదువుకున్నారు. అనంతరము 13-08-1990 తేదీన చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిలోనికి ప్రవేశించిన కనిగిరి విశ్వేశ్వరరావు ఆరుగొలను, నరసాపురం, వీర లంకపల్లి, పెద్దలేసి, రుద్రవరం, మల్లవరం, ఎల్ ఎన్ పురం, గోడి, ద్రాక్షారామం లో పనిచేసిన ఈయన ప్రస్తుతం తునిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. ఈయన దగ్గర చదువుకున్న విద్యార్థులకు చదువుతోపాటు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తన సొంత ఖర్చులతో విద్య కొన సాగడానికి సహాయం చేస్తున్నారు. వీరి దగ్గర చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది అధికారులుగా మంచి ఉన్నత చదువులు చదివి పెద్దపెద్ద స్థానాల్లో ఉన్నారని విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ ప్రస్తుత విద్యా ప్రమాణాలకనుగుణంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. నిరంతర విద్యార్థి, స్నేహశీలి మరియు చదువుతోపాటుగా సేవలో భాగముగా 500 రకాల మొక్కలను నాటించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ నా సర్వీస్ మొత్తంలో ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పే అవకాశం దేవుడు నాకు కల్పించిన ఒక వరం అని మరియు నా తల్లిదండ్రులు ఆశీస్సులు పూర్వజన్మ సుకృతం గా భావిస్తున్నానని ఇటువంటి అవకాశం ఎందరికో కానీ రాదని ఇన్ని సంవత్సరములు సర్వీస్ రావడం నాకు చాలా ఆనందంగా ఉందని ఎంతోమందిని అధికారులుగా ఉన్నత శిఖరాలకు వెళ్లిన వారిని చూసి నేను గర్విస్తున్నాను అని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా కనిగిరి విశ్వేశ్వరరావు మాస్టర్ గారికి ఉదయం నుండి బంధువులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తోటి ఉపాధ్యాయ సిబ్బంది, ఉన్నతాధికారులు, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు అభినందిస్తున్నారు.

### జాతీయ గీతం-వందేమాతరం

# తెలుగు భావానువాదం ఆకట్టుకుంటోంది

**స్వాతంత్ర్య స్ఫూర్తిని సులభంగా అర్థం చేసుకునేలా వినూత్న ఏర్పాటు**

**కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక ప్రదర్శన - ఆర్డీఓ ఎస్.మల్లిబాబు చొరవకు అభినందనలు**




**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ గీతం, వందేమాతరం గేయాల భావాన్ని ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకునే విధంగా తెలుగులో సరళమైన అనువాదంతో ప్రత్యేకంగా ప్రదర్శించారు. కాకినాడ ఆర్డీఓ ఎస్. మల్లిబాబు చొరవతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన కార్యాలయానికి వచ్చే అధికారులు, సిబ్బంది, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. జాతీయ గీతం, వందేమాతరం గేయాల్లోని ప్రతి పదం వెనుక ఉన్న భావం, దేశభక్తి, స్వాతంత్ర్య స్ఫూర్తిని సులభమైన తెలుగు భాషలో వివరించేలా ఈ ఏర్పాటు చేశారు. దేశంలోని భిన్నత్వంలో ఏకత్వం, భారతదేశ విశిష్టత, మాతృభూమిపై ప్రేమ, జాతీయ సమైక్యత వంటి గొప్ప భావాలను ఈ గేయాలు ప్రతిబింబిస్తాయని, వాటి అర్థాన్ని ప్రతి భారతీయుడు తెలుసుకోవాలనే ఉద్దేశంతో తెలుగు భావానువాదాన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సాధారణంగా జాతీయ గీతం, వందేమాతరం ఆలపించే సమయంలో వాటిలోని పదాల పూర్తి భావం అందరికీ తెలియకపోవచ్చని, అందుకే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాటి అంతరార్థాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశభక్తిని పెంపొందించడంతో పాటు యువతలో జాతీయ భావాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఏర్పాటు చేసిన ఈ తెలుగు భావానువాద ప్రదర్శనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 14న జిల్లా సమీక్ష సమావేశం

**ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన నిర్వహణ**

**మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో భేటీ**

**కాకినాడ, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా సమీక్ష సమావేశం ఈ నెల 14వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి, ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలు, శాఖల వారీగా చేపడుతున్న పనులు తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అవసరమైన సమాచారంతో సమావేశానికి హాజరై సమగ్ర వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు.



# తెలుగు సినీ జగత్తులో ధృవతార రేలంగి వెంకట్రామయ్య

రాజమహేంద్రవరంలో 116వ జయంతి మహోత్సవాలు -నివాళులర్పించిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు





**రాజమహేంద్రవరం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య 116వ జయంతి వేడుకలు రాజమండ్రి గౌడ, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గోదావరి గట్టున వద్దనున్న ఆయన కాంస్య విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, నగర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, బీసీ జేఏసీ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైసిపి సిజిసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైసిపి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, పందిరి మహాదేవుడు సత్రం చైర్మన్ రెడ్డి మణేశ్వరరావు, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, గౌడ, శెట్టిబలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు రెడ్డి రాజు, సెక్రటరీ బుడ్డిగ రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరంపూడి శ్రీహరి, సంఘం నాయకులు గెద్దాడ హరిబాబు, మార్గాన్ని చంటిబాబు, రేలంగి శేఖర్, అత్తిలి రాజు తదితరులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలుగు సినీ జగత్తులో రేలంగి వెంకట్రామయ్య ఒక ధృవతారగా వెలుగొందారన్నారు. ఆయన పంచిన ఆరోగ్యకరమైన హాస్యంతో తెలుగు ప్రేక్షకుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రావులపాలెం వద్దనున్న రావులపాడులో జన్మించిన ఆయన ఈ జిల్లా వాసి కావడం మనకు గర్వకారణమన్నారు. ఆయన పండించిన హాస్యం ప్రజకు నిత్యం ఆనందాన్ని పంచుతూనే ఉందని కొనియాడారు. హాస్య నటుడిగా పద్మశ్రీ అవార్డు అందుకున్న ఘనత కూడా రేలంగికే దక్కుతుందన్నారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని గోదావరి గట్టున ప్రతిష్టించేందుకు సహకరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు గౌడ, శెట్టిబలిజ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చిత్రాల్లో ప్రదర్శించిన హావభావాలు, పోషించిన పాత్రలు ప్రజలకు నిత్యం గుర్తుండి పోతాయన్నారు. ప్రతీ ఏటా ఆయన వర్ధంతి, జయంతి కార్యక్రమాన్ని నిర్వహించుకునే అవకాశం తమకు రావడం గర్వకారణంగా ఉందని, ఆయన తమ గీత కులంలో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నామని సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలో గౌడ, శెట్టిబలిజ సంఘ నాయకులు గేడి అన్నపూర్ణరాజు, రేలంగి శేఖర్, కొండేటి భీమారావు, అప్పారి జయప్రకాష్, కడియాల రాఘవ, గుత్తుల నాగేశ్వరరావు, పిల్లి వెంకట రమణ, టేకుమూడి బద్రీనాథ్, హరికృష్ణ, మట్టా శ్రీను, యామన నారాయణ గౌడ్, నరవ గోపాలకృష్ణ, రేలంగి వీర వెంకట సత్యనారాయణ, వేముల యేసుబాబు, బళ్ల శ్రీనివాస్, వనుము శ్రీనివాస్, దుంగా సురేష్, రుక్కు, శెట్టి జగదీష్ తదితరులు ఆయనకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# వైభవంగా సాగిన శ్రీ లక్ష్మీకుబేర సుదర్శన హోమం

## కుంకుమార్చనలు, వేద పారాయణ, హారతుల సమర్పణ
## విచ్చేసిన ప్రముఖులు, పులకించిన భక్తజనం, పూర్ణాహుతి అనంతరం ప్రసాద వితరణ





**రాజమహేంద్రవరం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం వద్దనున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ కుబేర సుదర్శన హోమం, రుద్ర ఏకాదశని పూర్వక సహస్ర ఘటాభిషేకంలో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీ లక్ష్మీకుబేర సుదర్శన హవనం మండపారాధన నిర్వహించారు. వచ్చిన భక్తులందరితో లక్ష్మీ సహస్రకుంకుమార్చన, లక్ష్మీ హవనము, కుబేర హవనము, సుదర్శన హవనము, చతుర్వేద పారాయణ తదితర క్రతువులు జరిగాయి. పూర్ణాహుతి అనంతరం కేరళ చెండై వాయిద్యాలు, సన్నాయి మేళం నడుమ వివిధ రకాల హారతులు సమర్పించారు. అశేష భక్తజనం పులకించిపోయారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీర్రాఘవమ్మ దంపతులు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, ఎపి ఐ ఐ సి మాజీ చైర్మన్ శ్రీఘా కోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, డిసిసిబి మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ప్రముఖ వ్యాపారవేత్తలు మధు ఫోమ్రా, చలుమూరి శ్రీనివాస్, నిమ్మలపూడి గోవింద్, మాజీ కార్పొరేటర్లు పొలసానపల్లి హనుమంతరావు దంపతులు, కురగంటి సతీష్, పోలు విజయలక్ష్మి, పిల్లి నిర్మల, మానే దొరబాబు, అరవ సురేష్ కుమార్, తదితరులు విచ్చేసి, కార్యక్రమాన్ని వీక్షించారు. దర్శనం చేసుకున్నారు. క్రతువు నిర్వాహకులు బోడెం నాగ సత్య రవికుమార్ శర్మను అలాగే ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూర్మదాసు ప్రభాకర్, సభ్యులు నందూరి సుబ్బారావు, ఏవి రమణ, వాకచర్ల కృష్ణ, పెదిరెడ్ల శ్రీనివాస్, గార్లపాటి సూర్యనారాయణ, దూర్వాసుల సత్యనారాయణ, సిహెచ్ నరసింహరాజు, బిఎస్ ఎన్ ఎల్ సాయిబాబా, తదితరులు పర్యవేక్షించారు. లాలాచెరువు మాజీ సర్పంచ్ మెట్ల ఏసుపాదం, పొదిలాపు నాగేంద్ర, తదితర కేబుల్ ఆపరేటర్లు భక్తులకు సహాయ సహకారాలు అందచేసారు. అనంతరం ప్రసాద వితరణ చేసారు.

బిఈఎమ్ ఎయిడెడ్ హై స్కూల్‌లో

# ఐఎఫ్‌పిలు ప్రారంభించిన ఆర్‌జెడి నాగమణి

## కాకినాడ జోన్-2లో ఐఎఫ్ ప్యానెల్ ఏర్పాటు చేసిన మొదటి ఎయిడెడ్ హై స్కూల్
## పాఠశాల యాజమాన్యం, సిబ్బందిచే స్వంతంగా ఏర్పాటు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఎయిడెడ్ పాఠశాలలో యాజమాన్యం స్వంతంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు లు ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆర్‌జెడి నాగమణి అన్నారు. స్థానిక మునిసిపల్ కోలనీ లోగల బిఈఎమ్ ఎయిడెడ్ హై స్కూల్ నందు యాజమాన్యం, సిబ్బంది కలిసి సమాకుర్చుకున్న నాలుగు ఫ్లాట్ ప్యానెల్‌లను బుధవారం ఆమె ప్రారంభించారు. తన జోన్ పరిధిలో ఇంటరాక్టీవ్ ప్లాట్ ప్యానెల్ లను ఏర్పాటు చేసుకున్న మొదటి ఎయిడెడ్ పాఠశాల ఇదే అన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ నేడు బోధనలో ఆధునిక టెక్నాలజి ముఖ్య పాత్ర వహిస్తోందని, తమ పాఠశాల విద్యార్థుల కోసం యాజమాన్యం, ఉపాధ్యాయులు ఫ్లాట్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అన్నారు.పాఠశాల కరెస్పాండెట్ బి.చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయిని శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంధి వారి మునిసిపల్ స్కూల్‌కు

# ఛాంబర్ ట్రస్ట్ మెగా ఫోన్, టేబుల్, కుర్చీలు బహుకరణ



**రాజమహేంద్రవరం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమి ఘాట్ లోని రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ తమ ఉచిత సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక మంగళవారపు పేటలోని రంధి వారి మున్సిపల్ కార్పొరేషన్ బేసిక్ ప్రైమరీ స్కూల్ వారి అభ్యర్ధన మేరకు విద్యార్థుల సులభ విద్యాబ్యాసం కోసం ఒక మెగా ఫోన్, ఒక టేబుల్, 8 కుర్చీలు అందజేశారు.ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు యియ్యపు మురళీధర్,మద్దుల మురళీకృష్ణ,ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా,సహాయ కార్యదర్శి యలమర్తి వెంకటేశ్వరరావు(బాబు), డైరెక్టర్స్ లక్కోజు వీరభద్రరావు(లక్కోజీ), మండవిల్లి వెంకట్రాజు(రాజా), ట్రస్ట్ ఎక్స్ అఫీషియో సభ్యులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తవ్వా రాజా, సభ్యులు శిఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరుల చేతుల మీదుగా స్కూల్ మాస్టర్ ఆర్. కిరణ్ కుమార్ కి అందజేయడం జరిగిందని గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం వస్తోంది..

# కానీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు స్వతంత్రం ఎక్కడ?

## పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలు పెంచాలి
## పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్



**రాజమహేంద్రవరం, ఆగస్టు 13, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వాలు సిద్ధమవుతున్నప్పటికీ, రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మాత్రం కనీస సౌకర్యాలు, నాణ్యమైన భోజనం, సురక్షితమైన వసతి, గౌరవప్రదమైన జీవనం అందడం లేదని ౹ాణాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాద్రి కిరణ్ కుమార్ చౌదరి తీవ్రంగా విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను వెంటనే పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను ప్రతి హాస్టల్‌లో తప్పనిసరిగా అమలు చేయాలని, మెనూ పేరుతో నాసిరకం భోజనం పెట్టడం, పరిమాణాలు తగ్గించడం వంటి చర్యలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. హాస్టళ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, సరైన వసతి వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.వార్డెన్లు, వంట సిబ్బంది, ఇతర సిబ్బంది పనితీరుతో పాటు పైస్థాయి అధికారుల పర్యవేక్షణలో కూడా సమూల మార్పు రావాలని అన్నారు. శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు కేవలం కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడం కాకుండా హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కనీసం ఒక్కరోజైనా అక్కడ బస చేసి విద్యార్థుల వాస్తవ సమస్యలను తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. “జైలులో ఉన్న ఖైదీకి రోజుకు అందించే ఆహార ఖర్చుతో పోల్చినా, దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులకు అందిస్తున్న మెస్ ఛార్జీలు ఇంత దారుణంగా ఉండటం ఏమిటి? జన్-జీ యువతకు ప్రభుత్వం ఇస్తున్న సందేశం ఇదేనా?” అని కిరణ్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.


### ఫుడ్ కమిషన్ చైర్‌పర్సన్ ప్రతాప్ రెడ్డి సమగ్ర దర్యాప్తు చేయాలి

రేపు రాజమహేంద్రవరం పర్యటనకు వస్తున్న ఫుడ్ కమిషన్ చైర్‌పర్సన్ శ్రీ ప్రతాప్ రెడ్డి గారు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న ఆహారం, అమలవుతున్న మెనూ, నాణ్యత, పరిమాణం, మెస్ ఛార్జీల వినియోగం, సంబంధిత రికార్డులు, విద్యార్థుల ఫిర్యాదులు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని పిడిఎస్‌యు డిమాండ్ చేసింది. హాస్టళ్లకు ప్రత్యక్షంగా వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, వంటశాలలు, స్టోర్ రూములు, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు, రికార్డులు తదితర అంశాలను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరారు. దర్యాప్తు అనంతరం వాస్తవాలను ప్రజల ముందుంచే విధంగా సమగ్ర నివేదికను విడుదల చేయాలని, అవకతవకలు లేదా నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతాప్ రెడ్డి గారిని కోరారు. హాస్టళ్లలో జరుగుతున్న అవకతవకలు, విద్యార్థుల సమస్యలను ప్రశ్నించే విద్యార్థి సంఘాలు, మీడియా, ప్రజా సంఘాలను అడ్డుకునే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేలా కొత్త జీవోలు తీసుకురావడం, అక్రమాలు మరియు దోపిడీకి పాల్పడేవారికి అనుకూల వాతావరణాన్ని సృష్టించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్స్ ఛార్జీల పెంపు, నాణ్యమైన భోజనం, మెనూ అమలు, సొంత భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బంది ఖాళీల భర్తీ, అధికారుల నిరంతర తనిఖీలు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే స్వాతంత్ర్యం కాదు. పేద విద్యార్థులు గౌరవంగా చదువుకునే హక్కు, నాణ్యమైన ఆహారం పొందే హక్కు, సురక్షితమైన వసతి పొందే హక్కు, తమ సమస్యలను ప్రశ్నించే హక్కు కలిగి ఉండటమే నిజమైన స్వాతంత్ర్యం. అందువల్ల ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఫుడ్ కమిషన్ చైర్‌పర్సన్ ప్రతాప్ రెడ్డి గారు రేపటి పర్యటనలో హాస్టళ్లపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి, సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ౹ాణాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ .కిరణ్ కుమార్ చౌదరి డిమాండ్ చేశారు.



# ఓటీటీలోకి 'చెన్నై లవ్ స్టోరీ'..

**కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియల లవ్ స్టోరీ స్ట్రీమింగ్ డేట్ ఇదే!**




కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన లేటెస్ట్ సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఇంటెన్స్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో సూపర్ హిట్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.50 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. క, కే ర్యాంప్ సినిమాలతో వరుసగా విజయాలు అందుకున్న కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ సినిమా చెన్నై లవ్ స్టోరీ. రవి నంబూరి తెరకెక్కించిన ఈ ప్రేమకథా చిత్రంలో తెలుగమ్మాయి శ్రీ గౌరి ప్రియ హీరోయిన్ గా నటించింది. బేబీ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న సాయి రాజేష్ ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే అందించారు. జులై 24న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. మేకర్స్ చెప్పినట్లు మరీ కల్ట్ లవ్ స్టోరీ కాకపోయినా ఉన్నంతలో మంచి ప్రేమకథా చిత్రమని ప్రశంసలు అందుకుంది. ఎప్పటిలాగే హీరో కిరణ్ అబ్బవరం మరోసారి తన యాక్టింగ్ తో అదరగొట్టాడు. ఇక ముఖ్యంగా హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ నటన ఈ సినిమాకు హైలెట్ గా నిలిచింది. సినిమాలో వీరి స్క్రీన్ ప్రజెన్స్, కెమిస్ట్రీకి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కేవలం రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చెన్నై లవ్ స్టోరీ మూవీ వరల్డ్ వైడ్‌గా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. కాగా థియేటర్లలో ఆడియెన్స్ ను అలరించిన ఈ ప్రేమ కథా చిత్రం ఇప్పుడు ఓటీటీ ఆడియెన్స్ ను అలరించేందుకు రెడీ అయ్యింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 21 నుంచి ఓటీటీలో చెన్నై లవ్ స్టోరీ స్ట్రీమింగ్ కానుందని తెలుస్తోంది. తెలుగుతో పాటు వివిధ భాషల్లోనూ కిరణ్ అబ్బవరం సినిమా అందుబాటులోకి రానుంది. త్వరలోనే దీనిపై ఓ అధికారిక ప్రకటన రానుంది. చెన్నై లవ్ స్టోరీ సినిమాను ప్రముఖ నిర్మాతలు ఎస్కేఎన్, సాయి రాజేష్ లు సంయుక్తంగా నిర్మించారు. హీరో, హీరోయిన్లతో పాటు త్రిగుణ్, దేవీ ప్రసాద్, సిరి హన్మంతు, పి వాసు తదితరులు ఈ మూవీలో కీలకపాత్రలు పోషించారు. మెలోడి బ్రహ్మ మణిశర్మ ఈ సినిమాకు సంగీతం అందించారు. సినిమా సక్సెస్ కావడానికి మణిశర్మ పాటలు, బీజీఎమ్ కూడా ఒక కారణం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. టైటిల్ కు తగ్గట్టుగానే చెన్నై నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. దర్శకుడు కావాలనుకునే ఒక అనాథ కుర్రాడు, అదే సమయంలో పీటలమీదే పెళ్లి ఆగిపోయిన అమ్మాయి ల మధ్య స్నేహం, ప్రేమ.. ఆ తర్వాత పరిణామాలతో ఆద్యంతం ఎమోషనల్ గా ఈ సినిమా సాగుతుంది. ఇటీవల కాలంలో వచ్చిన ఒక కొత్త రకమైన ప్రేమకథ అని ఈ సినిమాపై ప్రశంసలు వచ్చాయి. మరి థియేటర్లలో విజయం సాధించిన చెన్నై లవ్ స్టోరీ ఓటీటీలో ఏ మేర ఆకట్టుకుంటుందో చూడాలి.

ఆయనతో కలిసి నటించానని

# ఆ పెద్ద సినిమాల్లో రిజెక్ట్ చేశారు..

**కామాక్షి భాస్కర్ల కామెంట్స్**




టాలీవుడ్ నటి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా శుక్రవారం (ఆగస్టు 14) న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న కామాక్షి తన గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలుపెట్టిన కామాక్షి భాస్కర్ల ఇప్పుడు హీరోయిన్ గా, కీలక పాత్రల్లో నటిస్తోంది. ముఖ్యంగా పొలిమేర, పొలిమేర 2 సినిమాలతో కామాక్షికి మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడామె వరుస సినిమాలతో దూసుకుపోతోంది. అలా తాజాగా కామాక్షి ప్రధాన పాత్రలో నటించిన సినిమా అగధ. గతంలో వర్షం, ఒక్కడు, నువ్వొస్తానంటే నేనొద్దంటానా లాంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాలు నిర్మించడంతో పాటు 'వాన', 'తూనీగ తూనీగ', 'డర్టీ హరి', 'మళ్లీ పెళ్లి' సినిమాలకు దర్శకత్వం వహించిన ఎం. ఎస్. రాజు ఈ సినిమాను తెరకెక్కించారు. . సోషియో ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రావణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవిక విజయ్ కుమార్, రోషన్ బషీర్ ఇతర పాత్రల్లో నటించారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్ తో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న అగధ సినిమా శుక్రవారం (ఆగస్టు 14)న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్లలో బిజీ బిజీగా ఉంటోంది చిత్ర బృందం. హీరోయిన్ కామాక్షి భాస్కర్ల కూడా వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటోందీ అందాల తార. 'కొన్ని సినిమాల్ని డబ్బుల కోసం చేస్తాం. ఇంకొన్ని మనల్ని మనం సంతృప్తి పర్చుకునేందుకు చేస్తుంటాం. నెక్స్ట్ నేను ఓ లవ్ స్టోరీకి సైన్ చేశాను. 'పొలిమేర', 'అగధ' వంటి చిత్రాలకే సూట్ అవుతాను అని అనుకునే విషయాన్ని నేను బ్రేక్ చేస్తాను. మన సినిమా ఇండస్ట్రీలో చిన్న హీరోలు, చిన్న సినిమాలు చేసే వాళ్లకు పెద్ద సినిమాల్లో అంత తొందరగా మూవీ ఛాన్సులు రావు. నేను పొలిమేరలో సత్యం రాజేష్ పక్కన నటించానని ఓ పెద్ద సినిమాకు రిజెక్ట్ చేసారు. 'సత్యం రాజేష్ పక్కన చేసింది ఆ అమ్మాయి వద్దు' అని కొందరు అన్న మాటలు నా దాకా వచ్చాయి. ఇక్కడ ఎవరి పక్కన చేస్తున్నామో కూడా ఇక్కడ చూస్తున్నారు. అది చాలా తప్పు. ఇలా చాలా సినిమాలకు నన్ను రిజెక్ట్ చేసారు' అని వాపోయింది కామాక్షి భాస్కర్ల. ప్రస్తుతం ఈ హీరోయిన్ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. ఇక 'అగధ' సినిమా గురించి మాట్లాడిన కామాక్షి.. 'ఈ మూవీలో మరీ ఎక్కువ హారర్ మూమెంట్స్ ఉండవు. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. చివరికీ అందరికీ ఓ డివైన్ ఫీలింగ్ కలిగిస్తుంది. నేను చేసే సినిమాల్లో జానర్స్ రిపీట్ అవుతున్నా పాత్రలు మాత్రం కొత్తగానే ఉంటున్నాయి.' అని తెలిపింది.

# లంక మీద దాడి చేసేందుకు ముగ్గురు మొనగాళ్లను దింపనున్న భారత్..

శ్రీలంకతో శనివారం నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టులో టీమిండియా ముగ్గురు లెఫ్టార్మ్ స్పిన్నర్లతో బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేస్తోంది. గాల్ పిచ్‌పై 20 వికెట్లు తీసే సత్తా కుల్‌దీప్, జడేజా, మానవ్ సుథార్‌లకు ఉందంటూ బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ కీలక సంకేతాలు ఇచ్చారు. శ్రీలంకతో జరిగే ప్రతిష్టాత్మక తొలి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా వ్యూహాల మీద బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గాల్ స్టేడియంలో స్పిన్‌కు అనుకూలించే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ముగ్గురు లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్లను తుది జట్టులోకి తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు కోచ్ మోర్నే మోర్కెల్ మీడియా సమావేశంలో తెలిపారు. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుథార్ రూపంలో ముగ్గురు డిఫరెంట్ స్టైల్ కలిగిన స్పిన్నర్లు అందుబాటులో ఉండడం జట్టుకు పెద్ద కలిసివచ్చే అంశమని పేర్కొన్నారు. మ్యాచ్ జరిగే కొద్దీ పిచ్ మారుతుందని, స్పిన్నర్లు మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

**డిఫరెంట్ స్టైల్స్.. శ్రీలంకకు కష్టాలే**




ఈ ముగ్గురు స్పిన్నర్ల బౌలింగ్ వైవిధ్యం గురించి మోర్కెల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కుల్‌దీప్ యాదవ్ తన లెఫ్టార్మ్ చైనామాన్ స్పిన్‌తో ఏ క్షణంలోనైనా వికెట్లు తీయగల అటాకింగ్ బౌలర్. జడేజా తన సునిశితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తూ ఒత్తిడి పెంచుతాడు. ఇక మానవ్ సుథార్ క్లాసికల్ శైలిలో బంతిని గాల్లో తిప్పుతూ టర్న్ రాబడతాడు. ఈ ముగ్గురి వద్ద ఉన్న నైపుణ్యం ప్రత్యర్థి 20 వికెట్లను పడగొట్టడానికి సరిపోతుందని, వీరిని సరైన సమయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎలా ఉపయోగిస్తాడనేది ఆసక్తికరంగా మారనుందని వ్యాఖ్యానించారు.

**పేస్ విభాగంలో ఎవరికి అవకాశం?**

పేస్ బౌలింగ్ విభాగానికి వస్తే సీనియర్ మహమ్మద్ సిరాజ్‌కు తోడుగా ప్రసిద్ధ్ కృష్ణ లేదా గుర్‌నూర్ బ్రార్‌లలో ఒకరికి అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. వీరికి టెస్టుల్లో పరిమిత అనుభవమే ఉన్నప్పటికీ, దేశవాళీ క్రికెట్‌లో కష్టమైన పరిస్థితుల్లో బౌలింగ్ చేసిన అనుభవం బాగా ఉపయోగపడుతుందని మోర్కెల్ ధీమా వ్యక్తం చేశారు. శ్రీలంకలో ఉండే విపరీతమైన వేడి, ఉక్కపోతను తట్టుకుని బౌలింగ్ చేయడమే ఇక్కడ ప్రధాన సవాలు అని చెప్పారు. 20 నుంచి 35 ఓవర్ల తర్వాత కూకబుర్రా బంతి మెత్తబడినప్పుడు పేసర్లు తెలివిగా క్రీజును వాడుకుంటూ, షార్ట్ బాల్స్ విసురుతూ ఒత్తిడి తేవాలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

# బర్త్ డే నాడే ప్రపంచ రికార్డు.. సచిన్ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టిన అఫ్ఘాన్ సంచలనం

అఫ్గానిస్థాన్ యువ బ్యాటర్ సెదికుల్లా అటల్ తన 25వ పుట్టినరోజునే ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఐర్లాండ్‌పై 143 పరుగులతో సచిన్ టెండూల్కర్, టామ్ లాథమ్ రికార్డులను అధిగమించాడు. ఇబ్రహీం జద్రాన్‌తో భారీ భాగస్వామ్యం నెలకొల్పి అఫ్గాన్‌కు ఘన విజయం అందించాడు. అఫ్గానిస్థాన్ యంగ్ క్రికెటర్ సెదికుల్లా అటల్ తన 25వ పుట్టినరోజు నాడు అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన రికార్డును నెలకొల్పాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ ప్రపంచ రికార్డును తిరగరాశాడు.దీంతో ప్రపంచ దృష్టి అతడి మీద పడింది. తిప్పుకున్నాడు. సెదికుల్లా అటల్ బెల్ఫాస్ట్ వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో తన విశ్వరూపం చూపించాడు. బర్త్ డే రోజు మైదానంలోకి దిగి కేవలం 120 బంతుల్లో 17 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 143 పరుగులు సాధించాడు. ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో వన్డే క్రికెట్ చరిత్రలో పుట్టిన రోజు నాడు అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన బ్యాటర్?గా ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. గతంలో 2022లో న్యూజిలాండ్ ఆటగాడు టామ్ లాథమ్ నెదర్లాండ్స్‌పై తన 30వ పుట్టినరోజున చేసిన 140 పరుగుల రికార్డును అటల్ అధిగమించాడు.

**సచిన్, విరాట్ కోహ్లీల రికార్డులు కూడా కనుమరుగు**

ఈ ఇన్నింగ్స్‌తో అటల్ క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్‌ను సైతం దాటేశాడు. సచిన్ టెండూల్కర్ 1998లో ఆస్ట్రేలియా మీద తన 25వ పుట్టినరోజున 134 పరుగులు చేశాడు. ఆ రికార్డు ప్రస్తుతం మూడో స్థానానికి పడిపోయింది. బర్త్ డే రోజున వన్డేల్లో తొలి సెంచరీ చేసిన రికార్డు భారత్‌కే చెందిన వినోద్ కాంబ్లీ (1993లో ఇంగ్లాండ్‌పై 100 నాటౌట్) పేరిట ఉండగా, విరాట్ కోహ్లీ కూడా 2023లో సౌతాఫ్రికాపై తన 35వ పుట్టినరోజున 101 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. వీరందరినీ దాటుకుని అటల్ ఇప్పుడు అగ్రస్థానంలో నిలవడం విశేషం.

**ఇబ్రహీం జద్రాన్ రికార్డు భాగస్వామ్యం**




ఈ మ్యాచ్‌లో అటల్ మరో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్‌తో కలిసి రెండో వికెట్‌కు 231 పరుగుల రికార్డు పార్టనర్ షిప్ నెలకొల్పాడు. అఫ్గానిస్థాన్ వన్డే చరిత్రలోనే రెండో వికెట్‌కు అత్యధిక పార్టనర్ షిప్ ఇదే కావడం గమనార్హం. జద్రాన్ కూడా 107 పరుగులతో మెరిసి వన్డేల్లో వేగంగా 2000 పరుగులు పూర్తి చేసిన మూడో ఆసియా బ్యాటర్‌గా నిలిచాడు. వీరిద్దరి విజృంభణతో అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 343 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఐర్లాండ్ 48 ఓవర్లలో 301 రన్స్ చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో అఫ్గానిస్థాన్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో 5 వన్డేల సిరీస్‌ను అఫ్గానిస్థాన్ 3-0 తేడాతో ఖాయం చేసుకుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com